కుంభమేళాకు వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

విహారానికి వచ్చి విషాదాంతం

మంజీర నదిలో మునిగి ఒకరు మృత్యువాత

7లో

అమెరికాలో సేఫేనా?

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వందల్లో విద్యార్థులు

ఉన్నత చదువు కోసం వెళ్లి ఉద్యోగం చేస్తున్న వారిపై కొరడా

డిపోర్టేషన్ భయం గుప్పిట్లో విద్యార్థులు

పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయకుండా అక్కడుండటం కష్టతరమే

ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు



అమెరికాలో ఉన్నత చదువులు చదివి.. మంచి ఉద్యోగం సంపాదించి ఉన్నతంగా ఉందామనుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండాపోయింది. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయం.. ఉమ్మడి మెదక్ జిల్లాను ఉలిక్కిపడేలా చేసింది. విద్యార్థులు, ఉద్యోగుల కలలసౌధం అయిన అగ్రరాజ్యం విధించిన ఆంక్షల నడుమ తమ వారు ఎలా ఉన్నారనే ఆందోళన ఇక్కడి వారిలో వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడి ప్రకటన తర్వాత అక్కడి తమ వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఇప్పటి వరకు ఎలాంటి ఉపద్రవం రాలేదన్న మాటతో ఊపిరిపీల్చుకుంటున్నా.. ఏ క్షణాన ఎలాంటి సమాచారం వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

7

కార్మికుల కడుపుకొట్టిన

యంత్రం

- నాడు ఇసుక వ్యాపారానికి కేరాఫ్‌గా మంగల్‌పేట్
- నేడు పనుల్లేక బేజార్

7లో





సీఎల్పీలో సంజీవరెడ్డి

హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుతో కలిసి ఆయన సమావేశానికి హాజరయ్యారు.

-నారాయణఖేడ్, ఆంధ్రజ్యోతి



ఫైరింగ్ చేస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పోలీసులు ఆయుధాల పనితీరుపై అవగాహన పెంచుకోవాలి : ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. మొబిలైజేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట స్టేషన్ పరిధిలో నాలుగు రోజులుగా చేయిస్తున్న ఫైరింగ్ ప్రాక్టీస్‌ను గురువారం ఎస్పీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్, డీఎస్పీలు, సాయుధ దళ డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కంపుయార్డు వద్దే వద్దు..

- రెండో రోజూ నిరసనల పర్వం
- ఆందోళనలు.. అరెస్టులతో ఉద్రిక్తత
- నల్లవల్లిలో రోడ్డెక్కిన మహిళలు గ్రామస్థులు
- వాటర్ ట్యాంక్, సెల్‌టవర్ ఎక్కిన యువకులు
- గుమ్మడిదలలో స్వచ్ఛందంగా బంద్
- అఖిలపక్ష నాయకుల నిరసన ర్యాలీలు
- ఆందోళనలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి సంఘీభావం
- పోలీసుల నిఘాలో కొనసాగుతున్న డంపుయార్డు పనులు



నల్లవల్లిలో డంపుయార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న మహిళలు, గ్రామస్థులు



గుమ్మడిదలలో బీజేపీ నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

గుమ్మడిదల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్‌లో డంపుయార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు, వివిధ పార్టీల నాయకుల ఆందోళనలు.. పోలీసుల అరెస్టులతో గుమ్మడిదల మండలంలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. మండలవ్యాప్తంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ప్రజలతో కలిసి అఖిలపక్ష పార్టీల నాయకులు నిరసనలు ఆందోళనలతో హోరెత్తించారు. నల్లవల్లి గ్రామంలో రోడ్డెక్కి మహిళలు, పిల్లలతో సహా ప్రజలంతా ఎండలోనే ధర్నా నిర్వహించారు. డంపుయార్డు పనులు ఆపకుంటే ప్రాణ త్యాగానికైనా వెనుకాడబోమని మంబాపూర్, నల్లవల్లి గ్రామాల్లో యువకులు వాటర్‌ట్యాంక్, సెల్ టవర్ ఎక్కారు. గ్రామస్థులు, పోలీసులు వారికి నచ్చజెప్పి కిందికి దింపారు. గుమ్మడిదల మండల కేంద్రంలో అఖిలపక్ష నాయకులు వాడవాడలా ర్యాలీలు నిర్వహించారు. గాంధీవిగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా ఆగ్రహాన్ని గుర్తించి డంపుయార్డు పనులు ఆపాలని డిమాండ్ చేశారు. అంతకుముందు గుమ్మడిదల కానుకుంట చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గుమ్మడిదల మండల కేంద్రంలో అఖిలపక్షం నాయకులు, ప్రజా సంఘాలు, రైతుల ఆందోళనకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సంఘీభావం తెలిపారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా డంపుయార్డు ఏర్పాటు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె అఖిలపక్షం నాయకులతో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మరోవైపు పోలీసుల పహారా మధ్య డంపింగ్‌యార్డు పనులు కొనసాగించారు. ఒక్క రోజులోనే మట్టిరోడ్డు వేసి, సిమెంట్‌రోడ్డు పనులు చేపట్టారు. కాగా, ప్యారానగర్‌లో నిరసనల్లో పాల్గొంటారని జిన్నారం బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డంపుయార్డు పాపం కాంగ్రెస్‌దే..



గుమ్మడిదలలో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు పాపం కాంగ్రెస్‌దేనని అఖిలపక్ష పార్టీ నాయకులు మండిపడ్డారు. అఖిలపక్ష నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కుమార్ గౌడ్, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, వి.ప్రతాప్‌రెడ్డి గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 2008లో కాంగ్రెస్ హయాంలోనే ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. అప్పట్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురుకావడంతో నిర్మాణాన్ని విరమించుకున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలోనూ అధికారులు డంపుయార్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామని తెలిపారు. డంపుయార్డు ఏర్పాటుతో కలిగే అనర్థాల గురించి జిల్లా పరిషత్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో అప్పటి జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ భాస్కర్‌రెడ్డి గళం వినిపించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని అనుమతులు ఇచ్చిందని, పోలీసుల పహారాలో నిర్మాణ పనులు చేపడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజల వ్యతిరేకతను గుర్తించాలని, లేదంటే మండల ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీటీఎన్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఖాతాలోని నగదు జప్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి కాలుష్యానికి కారణమైన జీటీఎన్(ఇండియా) లిమిటెడ్ బ్యాంకు ఖాతాలోని రూ. 51.24 లక్షల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జీటీఎన్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (పర్‌ఫెక్ట్ నిట్టర్స్) పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాల్ని శుద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వ్యర్థాల్ని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఈటీపీ)ను సక్రమంగా వినియోగించలేదు. ప్లాంట్‌ను సక్రమంగా వినియోగించకుండా వ్యర్థాల శుద్ధికి వినియోగించాల్సిన రూ.51.24 లక్షలు మిగిలించుకున్నారు. శుద్ధి చేయని వ్యర్థాలను బయటకు వదలడంతో పరిసర ప్రాంతాల్లో నీరు, వాతావరణం కలుషితమైంది. ఈ విషయాన్ని గ్రహించిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) సంగారెడ్డి జిల్లా అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో గతంలో కేసు ఫైల్ చేసింది. పీసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్(పీఎంఎల్) యాక్ట్ 2002 కింద ఈడీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ప్లాంట్ నిర్వహణకు ఖర్చు చేయకుండా దారి మళ్లించి బ్యాంకు ఖాతాలో ఉంచిన రూ.51.24 లక్షలు జప్తు చేసినట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

నర్సాపూర్ బంద్ విజయవంతం

మెదక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి సమీపంలో ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ డంపుయార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా నర్సాపూర్‌లో గురువారం అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు ధర్నా చేశారు. దీంతో మెదక్ హైవే, సంగారెడ్డి-తూప్రాన్ మార్గాల్లో వాహనాలు నిలిచిపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డంప్‌యార్డు వల్ల నర్సాపూర్ అటవీ ప్రాంతం కలుషితమవుతుందని, సమీపంలోని చెరువులు కలుషితమై పచ్చని వాతావరణం పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డంపుయార్డు ఏర్పాటును అడ్డుకుంటామని, ప్రభుత్వం దిగివచ్చే దాకా ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి కాలేక్, వివిధ పార్టీల నాయకులు సంతోష్‌రెడ్డి, గోపి, సత్యం గౌడ్, జగదీష్, బాల్‌రెడ్డి, గోడ రాజేందర్, సురేష్, రమణారావు, శేఖర్, జ్ఞానేశ్వర్ గుప్తా, వినయ్, హుస్సేన్, విఠల్, యాదగిరి, ఆంజనేయులుగౌడ్, రామచందర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్యారానగర్‌ను మరో లగచర్లలా మారుస్తారా?

- ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్
- సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యేలు, నాయకులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న డంపుయార్డు పనులను తక్షణమే నిలిపివేయాలని సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం నాడు బీఆర్ఎస్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో పాటు ఆయా నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు, రైతులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డీఆర్వో పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో పోలీసుల బందోబస్తు మధ్య డంపుయార్డు నిర్మిస్తూ మరో లగచర్లగా మార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. పచ్చని అటవీ ప్రాంతంలో డంపుయార్డుని నిర్మించడం ప్రకృతిని ధ్వంసం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

200 నీలగిరి చెట్లపై

గొడ్డలివేటు

తూప్రాన్ రేంజ్ పరిధిలో కలప స్మగ్లర్ల దాష్టికం

7లో

వ్యాధి నయమయ్యేలా.. రోగి కోలుకునేలా..

- సంగారెడ్డి 'జీజీహెచ్'లో సమతులాహారం
- ప్రత్యేక మెనూ అమలు చేస్తున్న సర్కారు
- నిత్యం చీఫ్ డైటీషియన్ పర్యవేక్షణ
- పోషకాహారంతో రోగుల సంతృప్తి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సర్కారు దవాఖానాల్లో రోగులకు పోషకాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక మెనూ అమలు చేస్తున్నది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జనరల్ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు సమతుల ఆహారం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సర్కారు మార్గదర్శకాలను అమలు చేస్తూ రోగులకు డైట్ అందిస్తున్నారు.

నిత్యం 350 మందికి భోజనం

జీజీహెచ్, ఎంసీహెచ్‌లో నిత్యం 1,500 మంది ఓపీ, ఇన్‌పేషెంట్ 350 మంది వరకు వైద్య సేవలు పొందుతుంటారు. రోజూ 15-25 ప్రసవాలు జరుగుతాయి. సాధారణ రోగులతో పాటు ప్రసవానికి వచ్చే రోగులకు వేర్వేరుగా డైట్ ఇస్తున్నారు. చీఫ్ డైటీషియన్ బాలస్వామి పర్యవేక్షణలో జీజీహెచ్‌లో నిత్యం పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. ప్రతీవార్డులో రోగులతో మాట్లాడి ఆహారం ఎలా ఉందని ఆరా తీస్తున్నారు. రోగులు త్వరగా కోలుకునేలా బలవర్ధకమైన ఆహారం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనరల్ హాస్పిటల్‌లో భోజనం మెనూ ఇదే..

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారంలో ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్యలో ఇడ్లి, పొంగల్, కిచిడి, ఉప్మా, ఐదు బ్రెడ్ ముక్కల్లో ఏదో ఒకటి, ఉడికించిన కోడిగుడ్డు, కాచిన పాలు(100 మి.లీ.) లేదా కప్పు టీ ఇస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట సమయంలో మధ్యాహ్న భోజనంలో అన్నం (600 గ్రాములు), వెజ్ కర్రీ (150 గ్రాములు), ఆకుకూర పప్పు (150 గ్రాములు), సాంబారు (200 మి.లీ), ఉడికించిన కోడిగుడ్డు, అరటి పండు, పెరుగు (100 మి.లీ.) వడ్డిస్తున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య రాత్రి భోజనంగా అన్నం(300 గ్రాములు), పుల్కాలు(2), వెజ్ కర్రీ(150 గ్రాములు), ఆకు కూర పప్పు(150 గ్రాములు), సాంబారు(200 మి.లీ.), ఉడికించిన కోడిగుడ్డు, పెరుగు(100 మి.లీ.) లేదా మజ్జిగ(200 మి.లీ.) అందిస్తున్నారు.



జీజీహెచ్‌లో రోగులకు భోజనాన్ని అందజేస్తున్న సిబ్బంది

రోగుల డైట్ పక్కాగా అమలు



ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం రోగులకు పక్కాగా డైట్ సరఫరా చేస్తున్నాం. రోగులు త్వరగా కోలుకునేందుకు హైప్రొటీన్ డైట్ అందిస్తున్నాం. ప్రతీ వార్డులో తెలుగులో మెనూ బోర్డులు ఏర్పాటు చేశాం. రోగులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

-ప్రొ.జి.అనీల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్-సంగారెడ్డి

4,05,207 మందికి అల్బెండజోల్ మాత్రలు

- 1-19 యేళ్ల పిల్లలందరికీ మందులు
- సంగారెడ్డి సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 1-19 సంవత్సరాల లోపు 4,05,207 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా వంద శాతం మాత్రలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలకు ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని, తెల్లాపూర్, అమీన్‌పూర్, జీహెచ్ఎంసీ పరిధిలోని అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల, మున్సిపల్ స్థాయిలో అధికారులు సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని వజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రీదేవి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా, బీసీ సంక్షేమాధికారి జగదీష్, డీఈవో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఐసీడీఎస్ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, మరుగుదొడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



పనులు సరే.. ప్రమాద సూచిక బోర్డులేవి?

మండల కేంద్రమైన సిర్గాపూర్ నుంచి నారాయణఖేడ్ వరకు నిర్మిస్తున్న డబుల్ లేన్ రహదారి పనుల్లో భాగంగా నడుము లోతు వరకు తవ్వారు. కానీ ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రివేళల్లో ఇటువైపు నుంచి వెళ్లే వాహనదారులకు గుంతలు కనిపించక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా.. వెంటనే సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- కల్హేర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి)



మల్కాపూర్ రైతు వేదిక ఆవరణలో కోనోకార్పస్ చెట్లు



మునిదేవునిపల్లి వెంచర్‌లో పెంచుతున్న కోనోకార్పస్ మొక్కలు

పక్షి వాలని మొక్క.. పెరుగుతోంది ఎంచక్కా!

ఊరూరా ప్రాణాంతక కోనోకార్పస్ మొక్కలు

కొండాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగించే ప్రాణాంతకమైన కోనోకార్పస్ మొక్కలు గ్రామాల చుట్టూ విస్తరించాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, రోడ్లకు ఇరువైపులా, ప్రకృతి వనాలలో ఈ మొక్కలను విరివిగా నాటారు. అవి ఏపుగా పెరగడంతో పచ్చదనం సంతరించుకున్నది. ఈ మొక్కలు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచడం అటుంచితే చిన్నచిన్న జీవరాసుల ఆయువును తీస్తాయని, మానవులకు శ్వాసకోశ సమస్యలను తీసుకొస్తుందని వృక్ష శాస్త్రవేత్తలే చెబుతున్నారు. ఇవి వెదజల్లే పుప్పొడి, వ్యాపించే సువాసనతో దుష్పరిణామాలు ఉంటాయని, అందుకే పక్షులు, సీతాకోకచిలుకలు, కీటకాలు వాలవని తెలిపారు. దీంతో ఈ చెట్లను తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

కోనోకార్పస్ మొక్కలు తక్కువ కాలంలో ఏపుగా పెరగడం, ప్రతి రుతువులోనూ పచ్చదనంతో కళకళలాడుతుంది. వారాల వ్యవధిలోనే ఎదగడంతో గతంలో హరితహారం కార్యక్రమంలో ఈ మొక్కలనే ఎక్కువగా నాటారు. గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, వెంచర్లు, ఖాళీ స్థలాల్లో వీటిని నాటించింది. పల్లెలు, పట్టణాలకు రోడ్లకు ఇరువైపులా ఎక్కువగా ఈ మొక్కలనే నాటారు. వీటి వేర్లు భూమిలో పాతుకుపోతూ మధ్యలో అడ్డువస్తున్న కేబుళ్లు, డ్రైయినేజీ, తాగునీటి పైపులైన్ల సరఫరా వ్యవస్థను ధ్వంసం చేస్తున్నది. దీని దుష్పరిణామాలను గుర్తించి వీటిని హరితహారం ద్వారా నాటొద్దని, ఉన్న వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. అయితే, క్షేత్రస్థాయిలో ఈ ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తున్నది.

ఉద్యాన పంటల సాగుతో లాభదాయకం

● సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు

జహీరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఉద్యానపంటల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మధులైతండాలో ఉద్యానపంటల సాగుపై పలువురు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వ్యసాయ భూములు అన్ని పంటల సాగుకు యోగ్యమైనవన్నారు. రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. భూసార పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. పంటల సాగులో మెలకు వలు పాటిస్తే ఆశించిన దిగుబడులను సాధించవచ్చన్నారు. ఆయిల్‌ఫామ్ పంటల సాగుపై రైతులు అమితాసక్తిని చూయిస్తున్నారని తెలిపారు. అందుకు అవసరమైన మొక్కలు, తదితరాలను ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలికి, సేంద్రియ ఎరువులను వినియోగం పెంచాలన్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖలు ఎల్లప్పుడూ రైతులకు వెన్నుదన్నుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శైలజ, ఉద్యానశాఖ అధికారి పండరి, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ ప్రాంతంలో సాగవుతున్న మామిడి తోటలను వారు రైతులతో కలిసి పరిశీలించారు.

ఫైనాన్స్ వేధింపులు తాళలేక ఒకరి ఆత్మహత్య



సత్యనారాయణ (ఫైల్)

దౌల్తాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో అప్పు తీసుకొని తీర్చే మార్గంలేక, వారి ఒత్తిడి భరించలేక ఒకరు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్నది. బంధువులు, దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చందిన తుమ్మల సత్యనారాయణ(41) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం మూడేళ్లక్రితం సిద్దిపేటలోని ఐఐఎఫ్‌సీ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.16 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇందుకోసం ఇంటిని తనఖా పెట్టాడు. ఇందుకు ప్రతీ నెల రూ.22 వేల ఈఎంఐ రెండేళ్ల పాటు క్రమం తప్పకుండా కట్టాడు. ఏడాదిగా ఈఎంఐ కట్టలేకపోయాడు. ఫైనాన్స్ రికవరీ వాళ్లు ఇటీవల ఇంటికి వచ్చి అప్పు కట్టాలని, లేదంటే ఇంటిని జప్తు చేస్తామని నోటీసులు ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ బుధవారం అత్తగారి ఇల్లు అయిన కొనాపూర్‌కు వెళ్లాడు. అక్కడ భార్య రేణుకతో రాత్రి 9 గంటల ప్రాంతంలో అప్పు విషయంలో గొడవ జరిగింది. ఫైనాన్స్ కంపెనీ ఒత్తిళ్లు, ఇంట్లో గొడవల నేపథ్యంలో గురువారం ఉదయం బావమరిది పొలం వద్దకు వెళ్లిన సత్యనారాయణ అక్కడ చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..



దార నాగరాజు (ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని అనంతరావుపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దార నాగరాజు(42)కు భార్య నాగమణితో పాటు ఇద్దరు కుమారులు, తల్లి పెంటవ్వ ఉన్నారు. నాగరాజు తనకున్న 10 గుంటల భూమిలో వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం తెలిసిన వాళ్ల దగ్గర ఇల్లు కట్టుకోవడానికి అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై మూడేళ్ల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. సంవత్సరం క్రితం చెరువులో దూకి, ఆరునెలల క్రితం మరోసారి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతుకుతూ పొలం వద్దకు వెళ్లి చూసేసరికి చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతదేహన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

కుంభమేళాకు వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రవీందర్‌యాదవ్ (ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లి ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన మనోహరాబాద్ మండల పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కూచారం గ్రామ పరిధి డిల్లాయికి చెందిన మెరుడు రవీందర్‌యాదవ్(43) తన కుటుంబసభ్యులు, బావమరిది కుటుంబసభ్యులతో కలసి ఉత్తర్‌ప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు కారులో వెళ్లారు. కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించి, ప్రయాగ్‌రాజ్ నుంచి అయోధ్యకు వెళుతుండగా బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ముందున్న రవీందర్ అక్కడికక్కడే మృతిచెందగా, అతని బావమరిది ఐదేండ్ల కుమారుడికి ఎడమ చేయి విరిగింది. ఈ ఘటనలో మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా రవీందర్‌యాదవ్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య సుమలత, కుమర్తె, కుమారుడు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు..


మహేష్ మృతదేహం

రాయపోల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కింద పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ రఘుపతి, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ మహేష్(32) వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం పొలం వద్దకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య నాగమణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంజీర నదిలో మునిగి ఒకరు..


మహమ్మద్ మౌలానా మృతదేహం

పుల్‌కల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మంజీర నదిలో మునిగి ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రగతినగర్ కాలనీకి చెందిన మహమ్మద్ మౌలానా (60) గురువారం ఉదయం సింగూరు ప్రాజెక్టును చూసేందుకు వచ్చారు. ప్రాజెక్టు పరిసరాలను చూసిన అనంతరం స్నానం చేసేందుకని ప్రాజెక్టు దిగువ భాగంలో మంజీర నదిలోకి దిగారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మౌలానాకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో కుళ్లిపోయిన మృతదేహం గుర్తింపు


వడియారం మల్లేశ్(ఫైల్)

తూప్రాన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మద్యానికి బానిసై ఒంటరిగా ఉంటున్నాడు. ఎప్పుడు చనిపోయాడో, ఎలా చనిపోయాడో తెలియదు. స్థానికులకు ఆ ఇంట్లో నుంచి దుర్వాసన రాగా పోలీసులతో కలిసి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహన్ని గుర్తించారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలోని ఎస్సీ కాలనీలో గురువారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన వడియారం మల్లేశ్(48), భార్య జ్యోతికి మధ్య కలహాలతో ఆమె రెండేళ్లుగా కొడుకుతో వేరుగా ఉంటుంది. ఇంట్లో ఒంటరిగా ఉంటూ మల్లేశ్ మద్యానికి బానిసయ్యాడు. వారం, పదిరోజుల క్రితం ఇంట్లో మృతిచెందాడు. ఒక్కడే ఉంటుండటంతో ఎవరూ గుర్తించలేదు. గురువారం ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా, కుళ్లిపోయిన స్థితిలో మల్లేశ్ మృతదేహం గుర్తించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

తిమ్మాయిపల్లిలో అస్థిపంజరం లభ్యం

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో తగులబెట్టిన స్థితిలో ఉన్న అస్థిపంజరం లభ్యమైందని ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. సంఘటన స్థలంలో సగం కాలిన తల, అస్థిపంజరం వేర్వేరుగా పడిఉన్నాయి. ఆ అస్థిపంజరం ఆడ లేదా మగ ఎవరిదో గుర్తు పట్టలేని విధంగా కాలిపోయి ఉన్నాయి.

శవయాత్రపై తేనెటీగల దాడి

- 40 మందికి గాయాలు.. 9 మందికి తీవ్ర అస్వస్థత
- ఒకరి పరిస్థితి విషమం


నంగునూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్న సిబ్బంది, తీవ్రంగా గాయపడిన మహిళను సిద్దిపేటకు తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నంగునూరు, ఫిబ్రవరి 6 : శవయాత్రపై తేనెటీగలు దాడి చేసిన సంఘటన నంగునూరులో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి ముత్యాల రాజయ్య(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అంత్యక్రియలను గురువారం నిర్వహించారు. నంగునూరులోని ఇంటి దగ్గర నుంచి శ్మశానవాటికకు శవయాత్ర వెళ్తున్న సమయంలో గ్రామ శివారులోని చింతచెట్టు వద్దకు వెళ్లగానే ఒక్కసారిగా తేనెటీగలు లేచాయి. శవయాత్రలో వెళ్తున్న వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో మృతుని భార్య ఎల్లవ్వతోపాటు సుమారు 40 మంది గాయపడ్డారు. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్ర అస్వస్థకు గురైన మృతుని భార్య ఎల్లవ్వ, మరో ఏడుగురు రాకేష్(25), రాజెల్లయ్య(70), చంద్రయ్య(65), భాగ్యలక్ష్మి(48), లింగయ్య(69), మంజుల(38), ఉప్పలవ్వ(55)తో పాటు మరికొంత మందిని మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కు తరలించారు. ఈ తేనెటీగల దాడిలో రాజెల్లయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



అమెరికాలో సేఫేనా?

- ఉమ్మడి జిల్లా నుంచి వందల్లో విద్యార్థులు
- ఉన్నత చదువు కోసం వెళ్లి ఉద్యోగం చేస్తున్న వారిపై కొరడా
- డిపోర్టేషన్ భయం గుప్పిట్లో విద్యార్థులు
- పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయకుండా అక్కడుండటం కష్టతరమే
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డాలర్ డ్రీమ్స్‌తో యువత ఎంతోమంది అగ్రదేశమైన అమెరికాకు వెళ్లి స్థిరపడాలని కష్టపడుతుంటారు. ఉన్నత చదువుల కోసం, ఉద్యోగాల నిమిత్తం అక్కడికి వెళుతున్న విద్యార్థుల ఆశలను అమెరికా ప్రభుత్వం నీరుగార్చుతుంది. ఎన్నికల వాగ్దానాల అమలుకు ఉపక్రమించిన అమెరికా నూతన అధ్యక్షుడు ప్రస్తుతం చేతల్లోకి దిగారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న భారతదేశానికి చెందిన వలసదారులను తొలి విడతగా వెనక్కి పంపించారు. గురువారం అమెరికా నుంచి వచ్చిన సైనిక విమానంలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఎవరూ లేనప్పటికీ అమెరికాలో చదువు నిమిత్తం వెళ్లిన వారిలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. ఉమ్మడి జిల్లా నుంచి అమెరికాకు వెళ్లిన కొందరు ఎక్కడ తాము దొరికిపోతామోనని డిపోర్టేషన్ (ఆ ప్రాంతం నుంచి స్వదేశానికి పంపడం) భయం గుప్పిట్లో ఉన్నట్లు తెలిసింది. ఎఫ్1, హెచ్1 వీసాలపై మరిన్ని ఆంక్షలు విధించాలన్న ఆలోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉండడంతో, ఇకపై అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థులకు మరింత కష్టతరం కానున్నది.

పార్ట్‌టైమ్ ఉద్యోగంపై కలవరం

అమెరికాలో ఉన్నత చదువులు చదివి అక్కడే ఉద్యోగం పొంది స్థిరపడాలనుకున్న యువతకు ఇటీవల పరిణామాలు కొంత ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి అమెరికాలో ఉన్నత చదువుల కోసం వందల సంఖ్యల్లోనే తరలివెళ్లారు. అక్కడికెళ్లిన చాలా మంది ఆర్థిక సమస్యలతో పార్ట్‌టైమ్ ఉద్యోగంపైనే ఆధారపడిన వారు ఉన్నారు. అక్కడ ఇంత వరకు బాగానే ఉన్నా ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో పార్ట్‌టైమ్ చేస్తున్న పలువురు విద్యార్థులకు కష్టాలు తప్పేలా లేవు. పార్ట్‌టైమ్ ఉద్యోగం లేకున్నా పర్వాలేదు కానీ, స్వదేశానికి మధ్యలోనే పంపిస్తే తమ జీవితాలు నాశనమవుతాయని ఆవేదన చెందుతున్నారని తల్లిదండ్రులు తెలుపుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో, సైనికులకు ఏ విద్యార్థి ఎప్పుడు సరైన పత్రాలు లేకుండా కంటపడుతాడోనని భయం గుప్పిట్లో విద్యార్థులు ఉండగా, వారి తల్లిదండ్రులూ ఇక్కడ తల్లడిల్లుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇలా చేయడం దారుణమని పలువురు విద్యార్థుల కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని తమ పిల్లలను సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తమ పిల్లలకు ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే వహించాలని హెచ్చరిస్తున్నారు. ఇతర దేశాలకు చెందిన వారు మన దేశంలో నివసించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

అమెరికాది అమానవీయ చర్య



అమెరికా దేశం కేవలం వలస వచ్చిన వారితో నిర్మితమైన దేశం. కష్టానికి ప్రతిరూపమైన భారతీయులు ఎందరో తమ విజ్ఞానంతో ఎదిగి ఈరోజు అమెరికా కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్ మొదలగు సంస్థలకు సీఈవోలుగా రాణిస్తున్నారు. అమెరికా అంటే ఐటీ, ఐటీ అంటే భారతీయులు అన్నంతగా పెనవేసుకున్నారు. కానీ భారతీయులకు ఎలాంటి హెచ్చరికలు, సమయం ఇవ్వకుండా తరలించడం అనేది మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఎంతోమంది భారతీయులు విద్యార్థులు ఆర్థిక, మానసిక వేదనకు గురయ్యే అమానవీయ చర్య ఇది. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి. సమయం వృథా చేయవద్దు.

\- పిన్న రాములు, ప్రముఖ న్యాయవాది, సిద్దిపేట

ఉపాధిహామీ పనుల్లో మృతిచెందితే రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

అక్కనపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.15 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో మృతుల కుటుంబసభ్యులతో పాటు గాయపడిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సంఘటన జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తుందని, ప్రమాదానికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నామమాత్రంగా ఫీల్డ్ అసిస్టెంట్‌పై నెపం మోపి అతని ఒక్కడిపైనే జిల్లా అధికారులు చర్యలు తీసుకుని చేతులు దులుపుకోవడం సరికాదని ఆరోపించారు. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి మృతుల కుటుంబాలకు నష్టపరిహారంతోపాటు వారిలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శులు కొమ్ముల భాస్కర్, గడిపే మల్లేష్, నాయకులు జాగీరు సత్యనారాయణ, కొయ్యడ కొమురయ్య, ఎడల వనేష్, ఎగ్గోజు సుదర్శనచారి తదితరులు ఉన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరా మాయం


గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద చోరీకి గురైన సీసీ కెమెరా

అక్కన్నపేట, ఫిబ్రవరి 6 (ఆంధజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద అమర్చిన సీసీ కెమెరాలు మాయమవుతున్నాయి. గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు చేస్తున్నారని పలువురు రైతులు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ని ఆశ్రయించగా, ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2023 సెప్టెంబరు 23న గోదావరి పర్యావరణ బోర్డు అధికారులు గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద సోలార్ సిస్టంతో నడిచే దాదాపు 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాల్లో రికార్డు ఆయన దృశ్యాలను హైదరాబాద్‌లోని గోదావరి పర్యావరణ బోర్డు కార్యాలయంలో కనిపించేలా అనుసంధానం చేశారు. కానీ వారం రోజుల క్రితం ఒక సీసీ కెమెరాను ఎత్తుకెళ్లారు. గతంలో రెండు సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లడంతో అధికారులు మళ్లీ అమర్చారు.


భీమ్లా తండా నీలగిరి ప్లాంటేషన్‌లో నరికివేసిన చెట్లు

200 నీలగిరి చెట్లపై గొడ్డలివేటు

శివ్వంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం భీమ్లా తండాలోని నీలగిరి ప్లాంటేషన్‌లో 200 చెట్లను గుర్తుతెలియని దుండగులు నరికివేశారు. నీలగిరి కలపకు మంచి డిమాండ్ ఉండడంతో తూప్రాన్ రేంజ్ పరిధిలోని వెల్దుర్తి మండలం మంగలపర్తి సెక్షన్ శివ్వంపేట మండలం భీమ్లాతండాలో నీలగిరి ప్లాంటేషన్‌లో సుమారు రెండు వందలకుపైగా నీలగిరి చెట్లను చార్జింగ్ యంత్రాల సహాయంతో రాత్రి సమయంలో కోసివేసి డీసీఎంలో తరలించి విక్రయించినట్లు తెలిసింది. తూప్రాన్ ఎఫ్ఆర్‌వో అంబర్‌సింగ్‌ను ఈ విషయమై సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌తో పాటు సిబ్బందిని పంపించి విచారణ చేయించామని, అక్రమార్కులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కోతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న సెక్షన్ ఆఫీసర్ కిరణ్, సిబ్బంది

బీసీ కులగణన చరిత్రాత్మకం

- బీసీలంతా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం
- కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్
- సీఎం రేవంత్‌రెడ్డికి కలిసి కృతజ్ఞతలు తెలిపిన మధు


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ కులగణన చేపట్టి, భవిష్యత్ రాజకీయ భరోసా కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. సమర్థవంతంగా బీసీ కులగణన పూర్తి చేసినందుకు బీసీల తరఫున గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషాలో బీసీలకు సరైన రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదన్నారు. అధికారికంగా గణాంకాలను ప్రకటించడంతో బీసీలకు ఎంతో మేలు జరిగిందన్నారు. అవకాశాలు ఉన్నా బీసీలకు సరైన న్యాయం జరగలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ కులగణన చేపడతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. బీసీ కులగణనతో చట్టసభల్లో బీసీ నాయకుల ప్రాబల్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. గణాంకాల వెల్లడితో బీసీల పట్ల అన్ని పార్టీల వైఖరి మారుతుందనడంలో సందేహం లేదన్నారు. బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన భారీ సహాయానికి రుణపడి ఉంటామన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. దీంతో బీసీ కులాలకు అపారమైన అవకాశాలు లభిస్తాయన్నారు.

కార్మికుల కడుపుకొట్టిన యంత్రం

- నాడు ఇసుక కూలీలకు కేరాఫ్‌గా మంగల్‌పేట్
- నేడు పనుల్లేక బేజార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనేక రకాల వృత్తులు ఉన్నప్పటికీ, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట ఇసుక కార్మికులకు కేరాఫ్‌గా ఉండేది. ప్రస్తుతం యాంత్రీకరణ ఎఫెక్ట్‌తో ఎక్స్‌కవేటర్‌లు, మినీ ఎక్స్‌కవేటర్‌లను వినియోగిస్తుండడంతో కూలీలకు పని లేక బేజార్ అయ్యారు.

ఎక్స్‌కవేటర్ల వినియోగం

నారాయణఖేడ్ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో ఉండడంతో ఈ ప్రాంతంలో నీటి వనరులు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో అవసరమయ్యే ఇసుకను దూర ప్రాంతంలోని చెరువులు, వాగుల్లోంచి తెచ్చుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఇసుక వ్యాపారులు, లారీల యజమానులు, ప్రధాన రహదారిపై ఉన్న మంగల్‌పేటకు చెందిన కూలీలకు ఇసుక లోడింగ్, అన్‌లోడింగ్‌కు అవకాశం కల్పించారు. నాలుగు దశాబ్దాలుగా కూలీలు ఈ పనులతోనే ఉపాధి పొందుతూ వచ్చారు. రాత్రి, పగలు తేడా లేకుండా లారీ ఎప్పుడు వచ్చినా ఇసుకతో పాటు డస్టును, కంకరను లోడింగ్, అన్‌లోడింగ్ చేసేవారు. ఒక్కో లారీకి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు తీసుకునేవారు. కూలీల ద్వారా పనులు చేయిస్తే ఆలస్యం అవుతుందని, వ్యాపారులు ఎక్స్‌కవేటర్లను వినియోగిస్తున్నారు. దీంతో ఈ పనులపై ఆధార పడిన కూలీలు, ప్రస్తుతం పనులు లేక తల్లడిల్లుతున్నారు. మంగల్‌పేట్ నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఉన్నందున వారికి ఉపాధిహామీ వర్తించడం లేదు.

భూమి లేక కార్మికులుగా మారాం

మాకు ఎలాంటి భూములు లేక పోవడం వల్ల ఇసుక కార్మికులుగా మారాం. ప్రస్తుతం ఇసుక లోడింగ్, అన్‌లోడింగ్‌కు యంత్రాలను వినియోగిస్తుండడంతో పని లేకుండా పోయింది.

\- శాంతమ్మ, ఇసుక కూలీ

ఉపాధిహామీ వర్తింపజేయాలి

ఇటీవలి వరకు ఇసుక కార్మికురాలిగా ఉపాధి పొందినప్పటికీ, యాంత్రీకరణతో పనులు దొరకడం లేదు. మాకు కనీసం ఉపాధిహామీ పనులకైనా అవకాశం కల్పించాలి.

\- కళావతి, ఇసుక కూలీ


షెడ్‌లో లారీ నుంచి మినీ ఇటాచితో అన్‌లోడ్ చేస్తున్న కంకర

మినీ ట్యాంక్ బండ్‌గా ముత్తంగి చెరువు

- ఆట, వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్, బటర్ ఫ్లై లైట్ల ఏర్పాటుకు చర్యలు
- కసరత్తు చేస్తున్న అధికారులు



ముత్తంగి చెరువు

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభాకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు, చెరువులను అందంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాలనీల్లో పార్కు స్థలాలు కనుమరుగవుతుండటంతో చిన్నారులు,వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న వనరులు వినియోగించడానికి వీలుగా గ్రామీణ చెరువులను సుందరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామ పరిధిలో 20 పైచిలుకు కాలనీలు ఉన్నాయి. 80 శాతం ప్రజలు వివిధ పనిచేస్తున్నారు. సెలవురోజుల్లో పిల్లలతో సేదతీరడానికి సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు ముత్తంగి వెనక చెరువును మినీట్యాంక్ బండ్ తరహాలో తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఇందుకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో హెచ్ఎండీఏ అధికారులు రూ.7 కోట్లు నిధులు మంజూరు చేశారు. 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుకు చుట్టుపక్కల గట్టును ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దనున్నారు. చిన్నారులు ఆడుకోవడానికి పరికరాలు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, అన్నిరకాల వ్యాయామ పరికరాలు పెడతారు. రాత్రీపగలు అనే తేడా లేకుండా ఉండేందుకు బటర్‌ఫ్లైలైట్లు ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండటం వల్ల ఆహ్లాదకరంగా కనిపించేటట్టుగా చెరువు గట్టును తీర్చిదిద్దుతారు.

న్యూస్ బాక్స్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జోగిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, పేషెంట్ కేర్ సిబ్బందికి రెండునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర మెడికల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట రాజ్యం డిమాండ్ చేశారు. గురువారం ఆయన, సిబ్బందితో కలిసి జోగిపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యకు వినతిపత్రం సమర్పించారు.

బస్తీల్లో సీసీరోడ్లకు నిధులు మంజూరు చేయాలి

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బస్తీల్లో సీసీరోడ్లు వేయడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఎలంబర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్ పరిధిలో బస్తీలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు.

'చెత్తను వేరు చేయాలి'

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడి చెత్తను వేరు చేయాలని స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధులు చెప్పారు. గురువారం ఐడీఏబొల్లారం పురపాలక పట్టణ పరిధి బాలాజీనగర్, గాంధీనగర్ కాలనీల్లో తెల్లవారుజాము సమయంలో పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

'ప్రజలు జాగ్రత్తలు పాటించాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలానికి ముందు ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్నందున ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ అన్నారు. ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్ సమీపంలో ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ప్రైవేట్‌కు ధీటుగా విద్యాబోధన

మెదక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యాబోధన ఉంటుందని ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. చిన్నశంకరంపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జాయిన్ అవ్వాలని సూచించారు.

విద్యార్థులకు సన్మానం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చాప్టా.కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సుమిత్ర, విశాంత్ జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.నర్సింలు గురువారం తెలిపారు. రెండురోజుల క్రితం మంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని ప్రతిభచూపి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

10, 11 తేదీల్లో జిల్లాస్థాయి యువ ఖేల్ క్రీడలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువ కేంద్ర- మై భారత్ సంగారెడ్డి, జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10, 11వ తేదీల్లో సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో అండర్ 14-29 జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్‌వైకేఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జి శశ్వంత్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 9985351111 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు ఆర్టీసీ కార్మికులు బస్‌భవన్‌కు తరలిరావాలి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ 7న హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీకి సమ్మె నోటీసు ఇవ్వనున్నట్లు టీజేఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, బకాయి ఏరియర్స్ చెల్లించాలని, అన్ని విభాగాల్లో నియామకాలు చేపట్టాలని ఇచ్చే సమ్మె నోటీసుకు జిల్లాలోని టీజేఎంయూ కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మెదక్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపును హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, మతిన్, మల్లేష్‌యాదవ్, రతన్‌సింగ్, సత్తిరాజు, సంజీవకుమార్, అకిత్, అతిక్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'బియ్యం పంపిణీలో ఇబ్బంది ఉండొద్దు'

రేగోడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ దత్తరెడ్డి రేషన్ డీలర్లకు సూచించారు. గురువారం బాధ్యతలు చేపట్టిన దత్తరెడ్డిని రేషన్ డీలర్లు సన్మానించారు.

పార్కింగ్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం

- ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/కొల్చారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల్లో పార్కింగ్ క్రమబద్ధీకరించేందుకు శాశ్వత చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో పార్కింగ్ క్రమబద్ధీకరణ, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాతర నిర్వహణకు శాఖలవారీగా కార్యాచరణపై సమీక్షించారు. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేకించి ఆదివారం భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారన్నారని, వాహనాల పార్కింగ్ విషయంలో ఇబ్బందులు కలుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవోలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రం కొల్చారంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఎరువుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎరువు కొనుగోలు చేసిన రైతుల వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. ఎరువుల స్టాక్ రోజువారి అమ్మకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసురామ్ తండాలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

- జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఫైనాన్షియల్ అధికారి నర్సింలు



కరస్‌గుత్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

నాగల్‌గిద్ద/పుల్‌కల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఫైనాన్షియల్ అధికారి నర్సింలు అన్నారు. గురువారం మండల పరిధిలోని కరస్‌గుత్తి ప్రభుత్వ వైద్యశాలలో బేటి బచావో, బేటి పఢావో కార్యక్రమం ఏర్పాటై పదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జువేరియాబేగం, సూపర్‌వైజర్ విక్టోరియారాణి, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పఢావో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, బేటీ బచావో-బేటీ పఢావో జిల్లా సమన్వయ కర్త పల్లవి, ఏఎస్ఐ వేణుగోపాల్ రావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- 12న మెదక్ జిల్లా అధ్యక్షుడి ఎన్నికలు
- సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభకు 2025-26 సంవత్సరానికి సంబంధించి నూతన అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఐదేళ్లుగా మహాసభలో జీవిత సభ్యునిగా, లేదా జిల్లా, రాష్ట్ర కార్యవర్గంలో పనిచేసేన వారు పోటీకి అర్హులు అన్నారు. పోటీచేసే వారు రీఫండ్ కాని, రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 9న మెదక్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం 10 నుంచి నామినేషన్ పత్రాలు పొంది.. మధ్యాహ్నం 1 గంట వరకు సమర్పించాలన్నారు. మధ్యాహ్నా 2 నుంచి 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, అనంతరం తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 10న నామినేషన్ల ఉపసంహరణ, పోటీ ఉంటే 12న ఉదయం 9 నుంచి 2 గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి: ఇమ్మయ్య

పుల్‌కల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 17 లక్షలు జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తే, అదే 32 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు 12 శాతం ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకుడు ఎర్రోళ్ల పోచయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉండగా, 9 శాతానికే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మంద కృష్ణ నాయకత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మూడు దశబ్దాలకు పైగా గొప్ప ఉద్యమం కొనసాగిందన్నారు. మాదిగలకు న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్ల కోటా అంశంపై మంత్రి దామోదర్ పట్టుబట్టకపోవడం వల్లనే 9 శాతం కేటాయించారని ఆరోపించారు. జూలైలో గంగోజిపేటలో ముగ్గురు మాదిగ యువకులు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే మంత్రి కనీసం పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక డంపు సీజ్

వెల్దుర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును, హల్దీ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని హల్దీవాగు నుంచి అనుమతి లేకుండా నిల్వచేసిన సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక రాశులను సీజ్ చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, రెవెన్యూ, పోలీసులు ఉన్నారు.

బీసీలకు అన్యాయం జరిగితే సహించం

మెదక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు అన్యాయం జరిగితే సహించమని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024లో బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సర్వేలో బీసీలు ఎక్కువ ఉండగా... ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీల సంఖ్య తగ్గడమేంటని ప్రశ్నించారు. ప్రస్తుతం చేపట్టిన సర్వే బీసీలకు వ్యతిరేకంగా ఉన్నదన్నారు.

మా గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి



జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మా గ్రామంలో ఎస్సీకి రిజర్వేషన్ కల్పించాలంటూ లింగారెడ్డిపేట్ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గురువారం జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామానికి 1979కి ముందు ఒకసారి ఎస్సీలకు రిజర్వేషన్ వచ్చిందని, ఆ తర్వాత 45 ఏళ్లవుతున్నా ఒక్కసారి కూడా రాలేదని తెలిపారు. కావున ఈసారి మా గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాధికారి రాధాకిషన్



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీఈవో రాధాకిషన్

వెల్దుర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం వెల్దుర్తి, కుకునూర్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. పది ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో వెంట ఎంఈవో యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్రస్నానంతో ముగిసిన తిరుమల బ్రహ్మోత్సవాలు



తిరుమలస్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

నిజాంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో తిరుమలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గురువారం చివరిరోజు తిరుమలయ్య స్వామికి చక్రస్నానం నిర్వహించడంతో ఉత్సవాలు ముగిశాయని ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరి సహాయ, సహకారాలతో ఉత్సవాలు విజయవంతం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పాలకవర్గం పురోహితులు తదితరులున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ప్లాస్టిక్ బంద్



స్టీల్ బ్యాంకును పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ, ఎంపీడీవో

మెదక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఇక నుంచి ప్లాస్టిక్ వాడకం పూర్తిగా బంద్ చేసి, స్టీల్ సామగ్రినే వాడనున్నారు. అందుకోసం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్టీల్ బ్యాంకు పేరిట అన్ని స్టీల్ సామగ్రి ఏర్పాటు చేశారు. అందులో గ్లాసులు, ప్లేట్లు, నీళ్ల బాటిళ్లతో పాటు ప్రతీది స్టీల్‌వే వాడనున్నారు. స్టీల్ బ్యాంకుకు తెచ్చిన సామగ్రిని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో మాధవీలత ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన అవసరం

మెదక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించడం అభినందనీయమని మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీడీ శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గౌరీశంకర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యుత్ ఆధునీకరణ పనులకు రూ.4.39 కోట్లు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గంలో విద్యుత్ లైన్లు, ఫీడర్ల ఆధునీకరణ కోసం ప్రభుత్వం రూ.4.39 కోట్లు మంజూరు చేసింది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన లైన్లు, ఫీడర్ల ఆధునీకరణ కోసం నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి జూలై 30న విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కంగ్టి మండలం దెగుల్‌వాడీ ఫీడర్‌ను విభజించి, 11 గ్రామాల విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి రూ.23 లక్షలు, కంగ్టి రూరల్ ఫీడర్ విభజించడంతో పాటు నూతన లైన్ ఏర్పాటు కోసం రూ.18 లక్షలు మంజూరయ్యాయి. కంగ్టి మండలం రాసోల్, తుర్కవడగాం, చౌకన్‌పల్లి, తదితర గ్రామాల్లో విద్యుత్ ఆధునీకరణ పనులకు రూ.18 లక్షలు, నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేట పరిధిలో లైన్ల విభజన, నూతన ఫీడర్ ఏర్పాటుకు రూ.5 లక్షలు, మనూరు మండలం బోరంచ, బాదల్‌గాం, తోర్నాల్, ఎన్‌జీ.హుక్రాన, పుల్‌కుర్తి, బెల్లాపూర్, మాయికోడ్ గ్రామాల్లో ఆధునీకరణ పనులకు రూ.21 లక్షలు, నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి ఫీడర్ పరిధిలో ఆధునీకరణకు రూ.8 లక్షలు, అంతేకాకుండా పలు గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య నిర్మూలన కోసం రూ.21 లక్షలు, కల్హేర్ మండలం కిష్టాపూర్, తదితర గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్యకు రూ.9 లక్షలు, ఖేడ్ మండలం అనంత్‌సాగర్, తదితర గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య నిర్మూలనకు రూ.18 లక్షలు, నిజాంపేటమండలంలోని పలు గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య నిర్మూలనకు రూ.24 లక్షలు, సిర్గాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్యకు రూ.27 లక్షలు, క్రిష్టాపూర్ నుంచి కల్హేర్ పరిధిలో 7 కి.మీల లైన్ల అభివృద్ధికి రూ.49.49 లక్షలు, కంగ్టి నుంచి తడ్కల్‌కు 14 కి.మీల లైన్ల ఆధునీకరణకు రూ.98 లక్షలు, నియోజకవర్గంలో విద్యుత్ స్తంభాల ఆధునీకరణ కోసం 2 వేల స్తంభాల కోసం రూ.కోటి మంజూరు చేస్తూ విద్యుత్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను కోరిన వెంటనే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.4.39 కోట్లను మంజూరు చేశారని గురువారం తెలిపారు.



పచ్చందనమే పచ్చదనమే..

అటవీ ప్రాంతంలోని చెట్లు, చెట్ల ఆకులు రాలిపోయి మోడువారిపోగా.. తేట తెల్లమైన గుట్టల నడుమ పచ్చని వరి పంట కనువిందు చేస్తోంది. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని గోసాయిపల్లి శివారులో సుల్తానాబాద్, బీబీపేట్ గ్రామాల నడుమ రహదారిపై ఉన్న ఈ చిత్రం చూపరులను కనువిందు చేస్తోంది.

- కల్హేర్

బీజేపీ అభ్యర్థిని బలపర్చండి: గోదావరి అంజిరెడ్డి



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ పట్టభద్రుల బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి కోరారు. గురువారం నారాయణఖేడ్ ప్రాంతంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులతో ఆమె సమావేశమై చర్చించారు. బీజేపీ అభ్యర్థిని బలపరిచి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనర్సింహారెడ్డి, రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'చిరుధాన్యాల సాగును మరింత పెంచాలి'

మెదక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల సాగును పెంచాల్సిన అవసరం ఉన్నదని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేష్, జాతర నిర్వాహకులు వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బిడకన్నె గ్రామంలో గురువారం డీడీఎస్ ఆధ్వర్యంలో 25వ పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీడీఎస్ ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా పాత పంటల జాతర నిర్వహిస్తున్నామన్నారు.

చెరువులు ఆక్రమణకు పాల్పడితే చర్యలు

మెదక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా చెరువులు, కుంటల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని సబ్ డివిజన్ ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలను పరిశీలించి మాట్లాడారు. చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు, మట్టి తవ్వకాలు చేపతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. మండలంలోని చందంపేట పరిశ్రమ, ఖాజాపూర్ కావేరి పరిశ్రమ, చిన్నశంకరంపేట స్నాక్ పరిశ్రమ, చందంపేట శివారు డెక్కన్ పేపర్ పరిశ్రమలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నట్లు సమాచారమందడంతో పరిశ్రమలకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ శివారులోని మున్సిపాలిటీకి చెందిన డంపింగ్‌యార్డులో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించి, భారీఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో డంపింగ్‌యార్డు చుట్టుపక్కల్లో దట్టమైన పొగ అలుముకున్నది. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో.. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు సాయిలు, రోజీమేఘన, శ్యామల మాట్లాడుతూ ఏఎన్‌ఎం పోస్టులు పెంచాలని, ఏడు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్‌ఎంలకు బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే 17న నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీకి వినతిపత్రం అందజేశారు.

డిమాండ్ మేరకు నీటి సరఫరా చేస్తాం

తూప్రాన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామానికి డిమాండ్ మేరకు తాగునీటిని సరఫరా చేస్తామని నీటి సరఫరా విభాగం గ్రిడ్, ఇంట్రా అధికారులు పేర్కొన్నారు. ఘనపూర్ గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదంటూ బుధవారం తూప్రాన్ నీటి సరఫరా విభాగం కార్యాలయం వద్ద గ్రామస్థులు ఆందోళన చేయడంతో గురువారం గ్రిడ్ డీఈ రాజు, ఏఈ శ్రీధర్, ఇంట్రా ఏఈ మీనా గ్రామాన్ని సందర్శించి తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. శుక్రవారం వరకు నీటి సరఫరా తీరు మెరుగు పడుతుందన్నారు.

రోడ్డు మరమ్మతులకు రూ.1.20 లక్షలు

కోహీర్, ఫిబ్రవరి 6: (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోహీర్ నుంచి మండలంలోని పైడిగుమ్మల్ గ్రామం వరకు గుంతలమయంగా మారిన బీటీరోడ్డు పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 లక్షలు మంజూరు చేసిందని డివిజన్ పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీర్ రామచందర్ తెలిపారు. ఇటీవల 'పైడిగుమ్మల్‌కు వెళ్లేదేలా' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. అప్పట్లో అధికారులు స్పందించి కలెక్టర్‌కు నివేదికలు తయారుచేసి పంపించారు. అందుకు ప్రభుత్వం రోడ్డు పునర్నిర్మాణానికి రూ.1.20 లక్షలు మంజూరు చేసింది.

ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి

కోహీర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోహీర్ పట్టణంలోని పట్వారు బేస్ కాలనీకి చెందిన పలువురు గురువారం తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తమ కాలనీకి సమీపంగా ఉన్న ఓ ప్రైవేట్ వారు ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పరమేష్, సందీప్, అరుణ్, శీను, ప్రేమ్, చందు, రాజు, కృష్ణ, మల్లేశం, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆపదలో ఉన్న బాధితులకు ఆపన్నహస్తం

నిజాంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి ఆపన్నహస్తంగా ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నాయకుడు మసూద్‌అలీ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన దుద్దేడ రేఖ ప్రశాంత్‌కు రూ.60 వేలు, నందగోకుల్ గ్రామానికి చెందిన దొరగోల్ల లింగయ్యకు రూ.11 వేల సీఎంఆర్ఎఫ్ గురువారం చెక్కులను వేర్వేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.